కబ్జాకు.. కొండను సైతం పిండి చేశారు!



మెట్‌కానిగూడలో గుట్టను చదును చేసిన దృశ్యం

సుభాష్‌నగర్: సంక్రాంతి సెలవులు ఆ కబ్జారాయుడుకి కలిసి వచ్చింది. ఏకంగా చిన్నపాటి గుట్టను నేల మట్టం చేశాడు. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని సర్వే నంబర్.79లో ఓ వ్యక్తి రెండు రోజుల వ్యవధిలో 600 గజాల విస్తీర్ణంలో ఉన్న చిన్నపాటి గుట్టను చదును చేశాడు. గతంలో ఇదే సర్వే నంబర్లు మూడు ఎకరాలు ఆక్రమణకు గురి కాగా, తాజాగా ఈ స్థలంపై కన్ను పడటంతో ప్లాట్లుగా చేసేందుకు కొండను సైతం పిండిని చేశాడు. రెండు రోజుల వ్యవధిలో అక్కడ ఆనవాళ్లే మారిపోయాయి. ఈ విషయమై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డిని 'సాక్షి'వివరణ కోరగా ఈ విషయమై తమకు సమాచారం రాగానే వెంటనే పనులు ఆపినట్లు తెలిపారు. దీని వెనకాల సూత్రధారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కంటి వెలుగుకు ఏర్పాట్లు పూర్తి

జోనల్ కమిషనర్ మమత



కుత్బుల్లాపూర్: కూకట్‌పల్లి జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జోనల్ కమిషనర్ మమత పేర్కొన్నారు. ఈనెల 18న ఖమ్మంలో ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని తెలిపారు. 19వ తేదీ (గురువారం) అన్ని జిల్లాలతో పాటు కూకట్‌పల్లి జోనల్ పరిధిలో ఉన్న అల్వాల్-4, మూసాపేట్-6, కూకట్‌పల్లి-9, కుత్బుల్లాపూర్-5, గాజులరామారం-4 సర్కిళ్లలో మొత్తం 28 చోట్ల ఈ సెంటర్లను ఏర్పాటు చేశామని మంగళవారం 'సాక్షి'తో అన్నారు. ఇప్పటికే వాడవాడలా తిరిగి కంటి సమస్యతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించారని తెలిపారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కంటి వెలుగు కేంద్రాల్లో వారికి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు... అత్యవసరం ఉన్న వారికి శస్త్రచికిత్సలు చేసే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిర్యానీ @ రూ.10





సుభాష్‌నగర్ : ప్రస్తుతం మార్కెట్‌లో చిన్నచిన్న టిఫిన్ సెంటర్లలో సైతం కనీస ప్లేట్ ధర రూ.30. మీల్స్ అయితే రూ.70 నుంచి 100కు పైనే. ఇలాంటి తరుణంలో మధ్యప్రదేశ్‌కు చెందిన మహేష్ గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో కేవలం రూ.10కే వెజ్ బిర్యానీ అందిస్తున్నాడు. గతంలో అంబర్‌పేట్‌లో నడిపే వాడినని తెలిపాడు. అక్కడ తన కుటుంబ సభ్యులకు అప్పగించి దేవేందర్‌నగర్‌లో బిర్యాని సెంటర్ నడుపుతున్నానని పేర్కొన్నాడు. వచ్చే కొద్దిపాటి లాభాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నట్లు మహేష్ తెలిపాడు. ప్రతిరోజు 70 నుంచి 100 ప్లేట్ల వరకు అమ్ముతున్నాడు. అటుగా వెళ్లే వాహనాదారులు రూ.10కే వెజ్ బిర్యానీ బోర్డు చూసి ఒక పట్టు పట్టి వెళ్లిపోతున్నారు.

క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోండి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్ కమ్యూనిటీహాలులో బుధవారం పోస్టల్ అధికారుల ఆధ్వర్యంలో సుకన్య సంవృద్ధి యోజన, పీఎంవై పథకం, ఆధార్ నమోదు, ఇన్సూరెన్స్ పాలసీలను నిర్వహించనున్నారని బాలయ్యనగర్ అధ్యక్షుడు నాగేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు. సుకన్య సంవృద్ధి స్కీమ్‌కు 10 సంవత్సరాల లోపు ఆడపిల్లలు, 18 సంవత్సరాల లోపు ఉన్న అబ్బాయిలు పీఎంవై స్కీమ్‌కు అర్హులని, అదే విధంగా ఆధార్ కార్డు అప్‌డేట్, నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని బస్తీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి మెరుగైన సేవలు పొందాలని జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ డీఈ రాధాకిషన్ ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 19న చింతల్ హనుమాన్ గుడి వద్ద, భగత్‌సింగ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల, సోమయ్యనగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద, 20న రింగ్‌బస్తీ కమ్యూనిటీహాల్, 21న శివానగర్ కమ్యూనిటీ హాలు, 22న మగ్దూమ్‌నగర్ గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో తమ సిబ్బందికి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కౌంటర్లు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సహకరించాలని ఏఈ కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50వేలు అందజేస్తున్న జగన్‌యాదవ్

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 7వ డివిజన్‌లోని శ్రీనివాసనగర్ కాలనీలోని అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు చేయూతను అందిస్తున్నారు. 13వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల పావని తన వంతుగా రూ.50వేల నగదును అందజేయగా మంగళవారం సదరు మొత్తాన్ని ఆవుల జగన్‌యాదవ్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులు ధన్‌రాజ్‌యాదవ్, ఉంగరాల శ్రీనివాస్‌లకు అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు తల్లారి సాయిముదిరాజ్, యువకులు వినోద్, దోసకంటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2లక్షల ఎల్‌ఓసీ మంజూరు

దుండిగల్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ 18వ వార్డుకు చెందిన దామోదర్ కొన్ని రోజులుగా కేన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సంప్రదించగా ప్రభుత్వం నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. సదరు పత్రాన్ని మంగళవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ కృష్ణ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ భారత్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రేమకుమార్, రవి, విద్యానంద్, నరేష్ తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అదృశ్యం

దుండిగల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం 60 గజాల ప్రాంతానికి చెందిన కార్పెంటర్ షేక్ అబ్దుల్‌మాజీద్ (27) రెండు సంవత్సరాలుగా తన భార్య అబేదా బేగంతో వేరుగా ఉంటున్నారు. కాగా డిసెంబరు 29, 2022న కర్నాటకలోని జమాత్‌కు వెళ్లిన అతను ఈ నెల 5వ తేదీన తిరిగి వచ్చాడు. అయితే అతన్ని కలిసేందుకు కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లగా కనిపించలేదు. మొబైల్ ఫోన్‌కు ప్రయత్నిస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. బైక్ ఫైనాన్స్ విషయంలో తన కుమారుడు అబ్దుల్ మాజీద్‌కు ఖలీల్ అనే వ్యక్తితో గొడవ జరిగిందని మహ్మద్ ఉస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సిగ్నల్స్ పెట్టండి.. సిబ్బందిని నియమించండి

అప్పుడే ట్రాఫిక్ సమస్యకు ఊరట !



జీడిమెట్లలోని రంగా థియేటర్ ధర్మకాంట వద్ద..



నర్సాపూర్ రాష్ట్ర రహదారి డీపీకాలనీ వద్ద ట్రాఫిక్

జీడిమెట్ల: రోజుకు నగరంలో ట్రాఫిక్ పెరుగుతూనే ఉంది. పెరుగుతున్న ట్రాఫిక్‌కు తగ్గట్లుగా అధికారులు కొన్ని చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ట్రాఫిక్ సమస్య ఉన్నప్పటికి ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. అధికారుల తీరుపై ప్రజలు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు ప్రాంతాల్లో పోలీసులు దగ్గరుండి ట్రాఫిక్‌ను సవరించకపోయినప్పటికి కనీసం సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు పట్టించుకుని జీడిమెట్లలోని డీపీ కాలనీ జంక్షన్, రంగా థియేటర్ రోడ్డులోని ధర్మకాంట వద్ద సిబ్బందిని నియమించాలని వాహనదారులు కోరుతున్నారు.

డీపీకాలనీ వద్ద రెండేళ్లుగా తీవ్ర సమస్య..

జీడిమెట్ల, దుండిగల్, బొంతపల్లి, గాగిల్లాపూర్ ప్రాంతాలు పారిశ్రామిక ప్రాంతాలు కావడంతో ప్రతిరోజు వేలాది ప్రజలు వందలాది వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో ఉన్న దూలపల్లి క్రాసింగ్ డీపీ కాలనీ వద్ద ప్రతిరోజు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

- వాహనాల రాకపోకల సమయంలో ముఖ్యంగా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో డీపీ కాలనీ జంక్షన్‌లో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయం ట్రాఫిక్ అధికారుల దృష్టికి వెళ్లినప్పటికీ వారు జంక్షన్‌లో ట్రాఫిక్ సిబ్బందిని నియమించలేదు. సిగ్నల్ సైతం ఏర్పాటు చేయడం లేదని ప్రజలు అంటున్నారు.

రంగా థియేటర్ రోడ్డులోని ధర్మకాంట వద్ద..

ఇటీవల ట్రాఫిక్ అధికారులు జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులోని నాలా వద్ద తీవ్ర ట్రాఫిక్ ఏర్పడుతుండటంతో సిగ్నల్ ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులకు కాస్తా ఉరట లభించింది. అక్కడ ట్రాఫిక్ తగ్గినా జీడిమెట్లలోని రంగా థియేటర్ రోడ్డులోని ధర్మకాంట వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వాహనదారులు అంటున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి..



మేము ప్రతిరోజు జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా నుంచి ఇతర ప్రాంతాలకు కంపెనీ పని మీద వెళ్తుంటాం. ముఖ్యంగా జీడిమెట్ల డీపీకాలనీ, రంగా థియేటర్ జంక్షన్ల వద్ద ఎక్కువగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు పట్టించుకుని ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు సిగ్నల్స్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– సుబ్బరాజు, ప్రైవేట్ ఉద్యోగి, జీడిమెట్ల

ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకుని సదరు ఎక్స్ రోడ్డులో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిజాంపేట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి



అధికారులతో సమావేశమైన మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నామని మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావులతో కలిసి మేయర్ అధ్యక్షతన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం, ఎస్‌ఎన్‌డీపీ నాలా, రోడ్లు, డ్రైనేజీ, వైకుంఠధామాలు, పట్టణ ప్రగతిలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన పాలన అందించడమే లక్ష్యం...

నిజాంపేట్: మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. మంగళవారం బాచుపల్లి సాయినగర్‌లో నూతన ఏర్పాటు చేయనున్న మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనం, మార్కెట్‌యార్డు, క్రీడామైదానం స్థలాలను ఇన్‌చార్జ్ కమిషనర్ రామకృష్ణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... నూతన భవనాలు పూర్తయితే ప్రజలకు అన్ని సేవలు ఒకే చోట అభిస్తాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్యచౌదరి, కార్పొరేషన్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు మేయర్ వెంట ఉన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



జెడ్సీ మమతకు వినతి పత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

రంగారెడ్డినగర్: సుభాష్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో పార్కులకు కేటాయించిన స్థలాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కబ్జాలకు గురవుతున్నాయని అన్నారు. వాటి చుట్టూ కాంపౌండ్ వాల్స్, పార్కుల్లో ప్లాంటేషన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా జెడ్సీ సానుకూలంగా స్పందించారు. డివిజన్ బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు జహంగీర్, శ్రీను బస్తీ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, నారాయణరెడ్డి తదతరులు ఉన్నారు.

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే వివేకానంద్



దివ్యాంగ బాలుడి సమస్యను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి సమస్యలను నివేదించగా ఆయన సానుకూలంగా స్పందించారు.

- రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లో జీవో 59 కింద దరఖాస్తు చేసుకున్న ఇళ్ల యజమానులకు క్రమబద్ధీకరణకు లక్షల్లో చెల్లించాలని అధికారులు డిమాండ్ నోటీసులు అందజేశారని తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో ఫోన్లలో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు జల్దా రాఘవులు, ఖాజామియా, నర్సింహ, ఎల్లయ్య, బిర్జు సింగ్, సత్యనారాయణ, హనుమయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.
- ఈనెల 19 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో జగద్గిరిగుట్ట డివిజన్‌లోని మగ్దూమ్‌నగర్ సాయిబాబా కల్యాణ మండపం, గాజులరామారం డివిజన్ ఉషోదయకాలనీలోని కమ్యూనిటీహాళ్లను ఎమ్మెల్యే సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఉపకమిషనర్ ప్రశాంతి, ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీపీఓ హరిప్రియ, డీఈఈ రూపాదేవి, డీఈ రఘుపతిరెడ్డి, డాక్టర్లు నవనీత, మమత తదితరులు ఉన్నారు.

13 మందికి కోవిడ్ నెగిటివ్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీలో 13 మందికి పరీక్షలు చేశారు. అందులో అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎవరైనా జ్వరం, దగ్గు, గొంతు నొప్పి లక్షణాలతో బాధపడుతుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నాం

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా జగద్గిరిగుట్టను తీర్చిదిద్దుతున్నామని కార్పొరేటర్ జగన్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని సంజయ్‌పురి కాలనీలో జలమండలి డైరెక్టర్ స్వామి, కుత్బుల్లాపూర్ జీఎం శ్రీధర్‌రెడ్డి లతో కలిసి కార్పొరేటర్ పాదయాత్ర చేసి స్థానికంగా నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే కొత్త తాగునీటి పైపులైన్లు, భూగర్భ డ్రైనేజీ లైన్ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు మల్లేష్‌గౌడ్, వెంకటేశ్వర్లు, దామోదర్‌రావు, అప్పల శ్రీను, అరుణ్, కిరణ్, వెంకటేష్, లక్ష్మణరావు, అరవింద్, నరసింహచారి, మాణిక్‌చంద్, సునీల్ తదితరులు ఉన్నారు.

బీజేపీపై పోరాటానికి సిద్ధం కావాలి

కుత్బుల్లాపూర్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎస్‌ఎస్‌ఎస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఛలో గండిపేట్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి కుత్బుల్లాపూర్ నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. బహుజన సోషలిస్ట్ పార్టీ అధినేత మంద కృష్ణమాదిగ సారథ్యంలో బీజేపీపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఏకం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. సిలువేరు శ్రీనివాస్‌మాదిగ, యాదగిరిమాదిగ, సంజీవ,రమేష్ మాదిగ,నరసింహులు మాల, మహేష్, జ్యోతి, చిన్నమ్మ, ఎస్తేరురాణి, మల్లేశ్వరి, గీత తదితరులు తరలివెళ్లారు.

వృథాగా పబ్లిక్ టాయిలెట్లు



జగద్గిరిగుట్ట కొండపై ఉన్న టాయిలెట్లు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ లోపం కారణంగా వృథాగా పడి ఉన్నాయి. మూడు సంవత్సరాల క్రితం వివిధ ప్రాంతాలలో అధికారులు మైల్డ్ స్టీల్, బయో టాయిలెట్లను అమర్చారు. కాని వాటి నిర్వహణ మాత్రం మరిచారు. దీంతో లోపల ఉన్న సామగ్రిని అందిన కాడికి దోచుకెళుతున్నారు. ఒకటి రెండు చోట్ల మాత్రమే నిర్వహణ బాగుంది. కాని మిగితా చోట్ల పనికి రాకుండా పోయాయి. జగద్గిరిగుట్ట కొండపై అమర్చిన టాయిలెట్లలో తాళం పగలగొట్టి మరీ సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఇక మోడల్ మార్కెట్ సమీపంలో, దేవమ్మ బస్తీలో కూడా ఆదే పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు టాయిలెట్ల నిర్వహణపై చొరవ చూపి ప్రజలకి అందుబాటులోకి తేవాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య



కొంపల్లి 1వ వార్డులోని మహిళా భవన్‌ను సందర్శిస్తున్న అడిషనల్ కలెక్టర్, చైర్మన్ శ్రీశైలంయాదవ్

కుత్బుల్లాపూర్: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. ఈనెల 19 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 1వ వార్డులోని మహిళా భవనం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గాగిల్లాపూర్‌లోని 1వ వార్డు కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... కంటి పరీక్షలు చేయించుకునేందుకు సెంటర్లకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సేవలు అందజేయాలన్నారు. రిసోర్స్ పర్సన్‌లు, మెప్మాల ద్వారా ఇంటింటికి వెళ్లి కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డీఈఈ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ నందిని,దుండిగల్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు, రెవెన్యూ ఆఫీసర్ శ్రీహరిరాజు, ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సోషల్ ఎకనామిక్ సర్వే షురూ



మంజూర్‌నగర్‌లో ఇంటింటి సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన బస్తీలో కుత్బుల్లాపూర్ రెవెన్యూ సిబ్బంది మంగళవారం సోషల్ ఎకనామిక్ సర్వే నిర్వహించారు. ముందుగా సర్వే నం.342లోని మంజూర్‌నగర్‌లో ఇంటింట తిరుగుతూ ఇల్లు ఎవరి పేరున ఉంది, వయసు, నోటరీ ఇతర వివరాలను సేకరించారు. సిబ్బంది సర్వేకు రావడంతో ఇప్పటికే తమ ఇళ్లను రెండు సార్లు కూల్చి వేశారని, మరలా ఏం చేస్తారోనంటూ కొంతమంది వివరాలు చెప్పడానికి వెనుకడుగు వేశారు. మరి కొంతమంది తమ ఇళ్లను ఏం చేస్తారో అంటూ భయందోళన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 342లోని 45 ఎకరాలను హెచ్‌ఎండీఏకు అప్పగించడంతో ఆ స్థలం చుట్టూ 16 నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ తరుణంలో రెవెన్యూ సిబ్బంది సర్వే పేరిట వివరాలు సేకరిస్తుండటంతో ముందు ఏమి జరగబోతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

‘పది’ విద్యార్థులకు అవగాహన

- 6 పేపర్ల పరీక్షా విధానంపై విద్యాశాఖ ప్రణాళిక
- 40 రోజుల ప్రణాళికతో విద్యార్థులకు అవగాహన



సాక్షి,మేడ్చల్ జిల్లా: పదో తరగతిలో పూర్తి సిలబస్‌తో కొత్తగా తీసుకొచ్చిన ఆరు పేపర్ల పరీక్షా విధానంపై సరైన అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ యోచిస్తోంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మార్చి 10 వరకు 40 రోజుల పాటు ప్రణాళిక రూపొందించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ప్రతీరోజు పాఠశాల సమయానికి ముందు, తర్వాత గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ ఆరు పేపర్ల పరీక్షా విధానంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు రూపొందించిన 40 రోజుల ప్రణాళికకు అనుగుణంగా విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే ఆది, రెండో శనివారాల్లో పరీక్షలు పెట్టి.. ఫిబ్రవరి, మార్చిలో రెండు ప్రీఫైనల్ పరీక్షలు జరిపేలా విద్యాశాఖ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతోంది. 2022లో 70 శాతం సిలబస్ పరీక్షలు నిర్వహించగా.. ప్రస్తుతం వంద శాతంతో నిర్వహించనున్నారు. సామాన్యశాస్త్ర పరీక్షను ఒకేరోజు రెండు భాగాలుగా ఇవ్వనున్నారు. గతంలో 11 పేపర్లు ఉన్నప్పుడు ఒక పేపర్ సరిగా రాయకున్నా.. తర్వాత రోజు బాగా రాస్తే ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవటంతో.. దీనిపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో దిశానిర్దేశం చేయాలని విద్యాధికారులు ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని 'పది' విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10జీపీఏ పొందడానికి పాటించాల్సిన జాగ్రత్తలను సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులతో విద్యాశాఖ చెప్పిస్తోంది.

పదిలో 48 వేల మంది విద్యార్థులు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 108 ఉన్నత పాఠశాలల్లో 48 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మూడు జిల్లాల్లోని పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. కొత్తగా ఏర్పడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2016-17 విద్యా సంవత్సరంలో 85.22 శాతం, 2017-18లో 87.90 శాతం, 2018-19లో 92.98 శాతం, 2020-21లో 92 శాతం ఉత్తీర్ణత సాధించి ముందంజలో ఉన్నట్లు వెలుబడిన పదోతరగతి ఫలితాలను బట్టి తెలుస్తోంది. జిల్లాలోని 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యను అమలు చేస్తున్నారు. గతేడాది విద్యార్థులు ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోంటోంది. పాఠశాల పని దినాల్లో ఉదయం బాలికలకు, సాయంత్రం బాలురకు ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. వారానికి దాదాపు 12 పిరియడ్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు పిరియడ్లు గణితం, ఐదు పిరియడ్లు సామాన్య శాస్త్రం, మూడు పిరియడ్లు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించేలా చర్యలు తీసుకుంటోంది. పదో తరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతి రోజు ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్ర లేపేందుకు కూడా ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పని తీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లుతోంది.

ఫైప్‌లైన్ పగిలే.. రోడ్లపై నీరు పారే.!



కుత్బుల్లాపూర్ మున్సిపల్ రోడ్డులో లీకవుతున్న గోదావరి జలాలు

కుత్బుల్లాపూర్: జలమండలి అధికారుల నిర్లక్ష్యం వందల కిలోమీటర్ల నుంచి తీసుకువచ్చిన గోదావరి జలాలు నాలుగు రోజులుగా రోడ్లపై పారుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు. అల్వాల్ రిజర్వాయర్ నుంచి వచ్చే 500ఎంఎం డయా గల పైపులైన్‌కు నాలుగు రోజుల క్రితం కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో లీకేజీ ఏర్పడింది. సంక్రాంతి సెలవులు ఉండటంతో నాలుగు రోజులుగా నీరు రోడ్డుపై పారుతోంది. అదే విధంగా కుత్బుల్లాపూర్ ప్రధాన రోడ్డు నుంచి కుత్బుల్లాపూర్ విలేజ్ తదితర ప్రాంతాలకు వెళ్లే సైతం ఇక్కడి నుంచి వెళ్లడంతో పైపులైన్ ఏమైనా పగిలిందోనన్న సందిగ్ధత నెలకొంది. నాలుగు రోజులుగా నీరు మాత్రం రోడ్లపై పారుతుండడంతో వాహనదారులకు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.